## క్లుప్తంగా

### నేడు వేలంపాట

వీరఘట్టం: జిల్లా అటవీశాఖ పరిధిలో మండలంలోని వండువ కొండపై ఉన్న జీడితోటల ఫలసాయం అనుభవించుటకు మంగళవారం ఉదయం జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు వీరఘట్టం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రవిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఐదో తేదీన వేలంపాట నిర్వహించగా.. ప్రభుత్వం నిర్దేశించిన ధర రాకపోవడంతో పాట వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. వండువ కొండపై 1302 జీడి మొక్కలున్నాయన్నారు. గతేడాది కూడా వేలంపాటకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో అటవీ శాఖాధికారులే తోటలను సాగు చేశారు.

### ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంజీఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లావణ్యకుమార్

కొమరాడ: మండలంలోని తొడుము, దళాయిపేట, కెమిశీల గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంజీఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అల్లు లావణ్యకుమార్ సోమవారం పరిశీలించారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. పనుల సమయంలో వేతనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

### 'పరీక్ష పే చర్చ' విజయవంతం



వీరఘట్టం జెడ్పీ హైస్కూల్‌లో ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వీరఘట్టం: పరీక్షలంటే విద్యార్థుల్లో దాగి ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ప్రధానమంత్రి మోదీ సోమవారం నిర్వహించిన పరీక్ష పే చర్చ కార్యక్రమం మండలంలో విజయవంతమైందని ఎంఈఓలు డి. గౌరినాయుడు, ఆర్. ఆనందరావు తెలిపారు. అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్స్‌పై విద్యార్థులు పీఎం ప్రసంగాన్ని వీక్షించారన్నారు.

### పనుల పరిశీలన



మాట్లాడుతున్న ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పథకం నిధులతో జరిగిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు కాశీపేట స్వర్గధామానికి వెళ్లే రహదారిలో నిర్మించిన కల్వర్టు, 88 మీటర్ల అప్పలనాయుడు చెరువు సమీపంలో నిర్మించిన 128 మీటర్ల సీసీ రోడ్డు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరు చేసిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయినవి వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మండలానికి మరో 80 గోకులం షెడ్‌లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ సహాయకుడు, డిజిటల్ సహాయకుడు పాల్గొన్నారు.

### రహదారి భద్రతా నియమాలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ శశికుమార్

పార్వతీపురంటౌన్: రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఎంవీఐ శశికుమార్ అన్నారు. రహదారి భద్రతా మసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆర్టీసీ డ్రైవర్‌లు, ఆటోడ్రైవర్లతో జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చే ప్రోత్సాహక లబ్ధికి జిల్లాలోని ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు నడిపే ప్రతి ఒక్క డ్రైవర్ ఈ–శర్మ పోర్టల్‌లో తమ పేరు, ఇతర వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ కూడా వాహనం నడపరాదన్నారు. ప్రతి 6 మాసాలకు ఒకసారి కంటి, ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. గుడ్ సమరటిన్, గోల్డెన్ హావర్ గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా అనుమానితులు మాదకద్రవ్యాలను బస్సులలో రవాణా చేస్తే వారిని గుర్తించి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంవీఐ జి.సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్ డా. పి. నారాయణరావు, ఆర్టీసీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్‌లు పాల్గొన్నారు.

# ఆల్బెండజోల్‌తో.. 'నులి'పేద్దాం!



భామిని: చిన్నదిమిలి స్కూల్ పిల్లలకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ సోమవారం చేపట్టారు. రక్తహీనత, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి ఇబ్బందులు నులిపురుగుల వల్ల పడుతుంటారని, రెండేళ్ల వయసు దాటి 19 ఏళ్లలోపు వారందరితో ఈ నులిపురుగు నివారణ మాత్రలు వేయించాలని వైద్యులు సూచించారు. మధ్యాహ్న భోజనం చేసిన అరగంట తర్వాత ఈ మాత్రలు వేసుకోవాలని, ఈ నెల 17వ తేదీన మరోసారి మాత్రల పంపిణీ ఉంటుందన్నారు. –పాలకొండ, కురుపాం



గుమ్మలక్ష్మీపురం: గొరడ ఆశ్రమ పాఠశాల విద్యార్థితో ఆల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న రేగిడి పీహెచ్‌సీ వైద్యుడు ప్రదీప్‌కుమార్



సీతంపేట: గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థితో మాత్ర మింగిస్తున్న డిప్యూటీ ఈఓ ఆర్. ప్రసన్నకుమార్ తదితరులు



పాలకొండ: కొండాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాత్రలు వేయిస్తున్న వైద్య సిబ్బంది



గుమ్మలక్ష్మీపురం: కురుపాం కేజీబీవీలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



గరుగుబిల్లి: రావివలస అంగన్‌వాడీ కేంద్రంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీలో వైద్యారోగ్య సిబ్బంది



జియ్యమ్మవలస ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న ఎంఈఓ-2 శ్రీనివాసరావు



పాలకొండ రూరల్: బద్దుమాసింగిలో విద్యార్థులచే ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్యుడు రవికుమార్

## ఒత్తిడి జయించాలి

• ఎంఈఓలు కృష్ణమూర్తి, సోంబాబు

పాలకొండ రూరల్: రానున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకై ప్రణాళికాబద్ధంగా చదువుకోవడంతో పాటు ఒత్తిడిని జయించాలని మండల విద్యాశాఖాధికారులు పర్రి కృష్ణమూర్తి, కురిటి సోంబాబు సూచించారు. పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా పెద్దకాపువీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారు విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. ఒత్తిడిని జయించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్.సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు పుష్పనాథం, మల్లేశ్వరరావు, ఆలజంగి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మమేకమైన ఎంఈఓలు కృష్ణారావు, సోంబాబు, తదితరులు

## మన్యం బంద్ విజయవంతం చేయండి

సీతంపేట: ఈ నెల 12న తలపెట్టనున్న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు కోరారు. ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 5 వరకు బంద్ చేయాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిందన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో బంద్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బి.ఉమామహేశ్వరరావు, బి.అప్పారావు, ఎం.లక్ష్మణరావు, పి.సాంబయ్య, ఎం.ఉమామహేశ్వరరావు, జె.శ్రీరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

## మృతుల కుటుంబాలను ఆదుకుంటాం..



నల్లరాయిగూడలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి



సతివాడలో మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

• మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

భామిని: మండలంలోని నల్లరాయిగూడకు చెందిన ఆరిక మచ్చ (50) ఇటీవల మృతి చెందారు. బిల్లుమడకు చెందిన కోటిలింగాల చక్రపాణి (70) వంశధార నది ఇసుక ర్యాంపు గోతిలో పడి మరణించారు. అలాగే సతివాడకు చెందిన సింగన్నశెట్టి సూరి (68) అనారోగ్యంతో ఇటీవల కన్నుమూశారు. దీంతో ఆయా మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం పరామర్శించి, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ బిడ్డిక గొయింతి, పార్టీ నాయకులు బిడ్డిక నూకయ్య, మేడిబోయిన చలపతి, దామోదర కంఠయ్య, పతివాడ పగడాలమ్మ, దామోదర అప్పన్న, కార్యకర్తలున్నారు.

## నలుగురు అరెస్ట్

సీతంపేట: గతంలో సారా తయారుచేస్తూ పరారైన రెండు కేసులకు సంబంధించి నలుగురు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెలలో చాపరాయిగూడ సమీపంలో సారా బట్టీలపై దాడులు చేయగా 20 లీటర్ల సారా పట్టుబడిందన్నారు. ఆ సమయంలో తయారీదారులు పరారవ్వగా.. అందులో ఒకరైన మురళి అనే వ్యక్తిని తాజాగా పట్టుకున్నామన్నారు. అలాగే గతేడాది జనవరిలో నారాయణగూడ ప్రాంతంలో సారా బట్టీలపై దాడులు చేపట్టగా 20 లీటర్ల సారా పట్టుబడిందని.. అప్పుడు కూడా తయారీదారులు పరారవ్వగా.. కుబేరు, నాగేశ్వరరావు, సుధాకరరావుల ను సోమవారం పట్టుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

## 12న మన్యం బంద్

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సంరక్షణ చట్టం 1/70ను సవరణ చేయాలని స్పీకరు అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 12వ తేదీన మన్యం బంద్ చేపట్టనున్నట్లు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.గౌరీశంకరరావు, సర్పంచ్‌లు బిడ్డిక సూర్యం, ఆర్ఎస్ చైతన్యస్రవంతి, ఎం.కృష్ణారావు, కె.వాసుదేవరావు తెలిపారు. ఇదే విషయమై వారంతా గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట ప్రాంతాల్లో సోమవారం పర్యటించి, బంద్‌పై ప్రచారం చేశారు. వ్యాపారులకు బంద్ కరపత్రాలు పంపిణీ చేసి, బంద్‌కు సహకరించాలని కోరారు. తమ బంద్ ద్వారా ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలనే ఉద్దేశమే తప్ప మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం కాదన్నారు.



కరపత్రాలు ప్రదర్శిస్తున్న సర్పంచ్‌లు

## త్వరితగతిన సర్వే పూర్తి చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్

జియ్యమ్మవలస: మండలంలో జరుగుతున్న ఎంఎస్ఎంఈ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఎస్.రమేష్ సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఎంఎస్ఎంఈ సర్వేను సోమవారం పరిశీలించిన ఆయన.. పలు సూచనలు చేశారు. ఇదిలా ఉండగా, మండలంలోని పెదమేరంగి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో పరిశీలించి, రెండు పూటలా నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. పనిలోకి వచ్చిన వారికే మస్తర్లు వేయాలని, బోగస్ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

## పక్కాగా 'కిశోరీ వికాసం'



అవగాహన కల్పిస్తున్న బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణ

పాలకొండ రూరల్: సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ ద్వారా కిశోరీ బాలికల వికాస కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో పక్కాగా అమలు చేయాలని బాలల సంరక్షణ జిల్లా అధికారి అల్లు సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బందికి ప్రత్యేక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ సిమ్మాలమ్మ, లీగల్ ప్రొహిబిషన్ అధికారి పి.శ్రీధర్‌బాబు, తదితరులు మాట్లాడుతూ.. వికాస కార్యక్రమంలో భాగంగా బడి బయట పిల్లలను బడి బాట పట్టించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, రుతుక్రమంలో అనుసరించాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, ఆరోగ్య రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.దశారత్నం, టి.మేరి, రాజేశ్వరి, జ్ఞానమ్మ, పి.త్రివేణి, ఎస్.పల్లవి, ఎ.రమ్య, సోషల్ వర్కర్, శిశుగృహ అధికారి అరుణ్‌జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురం రూరల్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్సై సంతోషి అన్నారు. ఈ మేరకు మండలంలోని ఒడిశా బోర్డర్‌లో గల లోవవలస గ్రామాన్ని ఆమె సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ నేరాలపై, టోల్‌ఫ్రీ నంబర్లపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అపరిచితుల నుంచి బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన ఓటీపీలను ఎట్టి పరిస్థితుల్లో చెప్పకూడదన్నారు. మహిళలు, విద్యార్థులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం పలు చట్టాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఎక్కడైనా ఇబ్బంది కలిగితే టోల్‌ఫ్రీ నంబర్లను వినియోగించాలని సూచించారు. టోల్‌ఫ్రీ నంబర్ల ద్వారా పోలీసుల నుంచి కొద్ది సమయంలోనే రక్షణ కల్పించనున్నామన్నారు.

## వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

వీరఘట్టం: మండలంలోని తెట్టంగిలో రెండు రోజులుగా జరుగుతున్న మహాలక్ష్మి పేరంటాలు తీర్థంలో భాగంగా శ్రీనివాసుడి కల్యాణోత్సవం సోమవారం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గుజ్జల నారాయణరావు, జయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో స్వామి కల్యాణం జరిగింది. అనంతరం మహాలక్ష్మి పేరంటాలకు నిత్య హారతితో కుంకుమ పూజలు చేపట్టారు. సామూహిక కుంకుమ పూజల్లో గ్రామానికి చెందిన 200 మంది దంపతులు పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది.

**ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు..**

మహాలక్ష్మి పేరంటాల ఉత్సవం సందర్భంగా నిర్వాహకులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో దీపారాధన నిర్వహించారు.



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న దంపతులు

## పూడికతీత ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

• సీపీఎం నాయకులు

పాలకొండ: నగర పంచాయతీ కాలువల్లో పూడికతీత పనుల కోసం చేపట్టిన ఖర్చుల వివరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఎం పట్టణ నాయకుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని 6,7 వార్డుల పరిధిలో సోమవారం పర్యటించి పారిశుధ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏలం సెంటర్ నుంచి వడమ వరకు ఉన్న సాగునీటి కాలువ పూర్తిగా మురుగు కాలువగా మారిందని తెలిపారు. ఈ వార్డుల పరిధిలో కనీసం కాలువలను శుభ్రం చేయడం లేదని ఆరోపించారు. ఇటీవల పూడికతీత పనుల కోసం నగర పంచాయతీ నుంచి సుమారుగా 20 లక్షల రూపాయలు కేటాయించినట్లు తెలిసిందని.. దీనిపై కమిషనర్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు సీపీఎం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పారిశుధ్య పరిస్థితిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

## ఆక్రమణలో హైస్కూల్ ప్రాంగణం

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. రూ.లక్షల విలువ గల ఈ స్థలంలో తొలుత ఓ వ్యక్తి ఓ రేకుల షెడ్ నిర్మించాడు. అధికారులు ఎవరూ ప్రశ్నించకపోవడంతో మరికొంత మంది వ్యక్తులు పక్కనే ఉన్న స్థలంలో సోమవారం మట్టిని పోసి చదును చేశారు. మరో నాలుగు షెడ్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇంత జరుగుతున్నా అటు ఆర్అండ్‌బీ అధికారులు గాని ఇటు 0వీరఘట్టం హైస్కూల్ సిబ్బంది గాని పట్టించుకోవడం లేదు. ఇలా వదిలేస్తే ప్రాంగణం మొత్తం ఆక్రమించేస్తారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



వీరఘట్టం హైస్కూల్ ఎదురుగా ఆక్రమణలకు గురైన స్థలం ఇదే

## 'ఫార్మర్ రిజిస్ట్రీ' తప్పనిసరి

• ఏఓ సౌజన్య

వీరఘట్టం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలు రైతులకు అందాలంటే సొంత భూమి ఉన్న ప్రతి రైతూ ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి జక్కువ సౌజన్య సూచించారు. మండలంలోని చేబియ్యంవలసలో రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయితీలు, ఎరువుల రాయతీలు, పంటల బీమా, కనీస మద్దతు ధర, పంట రుణాలు, తదితర పథకాలు వర్తించాలంటే రైతులందరూ భూ ఆధార్ నంబర్ కలిగి ఉండాలని సూచించారు.



ఫార్మర్ రిజిస్ట్రీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సౌజన్య

## అన్ని రంగాల్లోనూ రాణించాలి



ప్రశంసాపత్రాలు, మెమొంటోలతో విద్యార్థులు

గరుగుబిల్లి: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఉల్లిభద్ర ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.రాజ్యలక్ష్మి ఆకాంక్షించారు. ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ మీట్ సందర్భంగా అదే కళాశాలలోని విద్యార్థులకు క్రీడాపోటీలతో పాటు సాహిత్య, సాంస్కృతిక పోటీలు సోమవారం నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

## సదరం సర్టిఫికెట్ల పరిశీలన

గరుగుబిల్లి: మండలంలో పింఛన్ పొందుతున్న దివ్యాంగుల అర్హత తెలిపే ధ్రువపత్రాలు(సదరం సర్టిఫికెట్లు) వైద్యులు పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. ఇదే విషయమై ఆమె మండల కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రి, పాలకొండ ఏరియా ఆస్పత్రిలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ నియమించిన వైద్యాధికారులు సర్టిఫికెట్‌లు పరిశీలిస్తున్నారని, అర్హులైన దివ్యాంగులంతా నిర్దేశించిన తేదీల్లో ఆయా ఆస్పత్రులకు వెళ్లి, సర్టిఫికెట్లను చూపించాలన్నారు.